APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్ వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 86 | ఆగస్టు16 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## కేంద్రం సన్నబియ్యం డబ్బులిస్తే ప్రధాని ఫొటో అంశాన్ని పరిశీలిస్తాం!

సూర్యాపేట : సన్నబియ్యం పంపిణీకి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరిస్తే, అప్పుడు స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో పెట్టే అంశాన్ని ఆలోచిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిరుపేదల కడుపు నింపే స్మార్ట్ రేషన్‌కార్డుల విషయంలో రాజకీయాలు, అనవసర రాద్ధాంతాలు చేయడం మానుకోవాలని సూచించారు. రేషన్ బియ్యం కోసం అరకొర నిధులిచ్చినవాళ్లు .. అసలు నిధులే ఇవ్వని వాళ్లు కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. సూర్యాపేటలో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కార్డుల్లో వాళ్ల ఫొటోలు పెట్టుకోవొద్దని తామేమీ చెప్పడం లేదన్నారు. రూ.14.9 కోట్లు వెచ్చించి తాము సన్నబియ్యం ఇస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది దొడ్డుబియ్యం మాత్రమేనన్నారు. కేంద్రాన్ని గౌరవించి ప్రొటోకాల్ ప్రకారం రేషన్ దుకాణాల్లో ప్రధానమంత్రి ఫొటో పెడుతున్నామని వివరించారు.

## హోర్ముజ్‌పై ఇరాన్ కీలక నిర్ణయం.. అమెరికాకు గట్టి కౌంటర్..

టెహ్రాన్: అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదురుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు సురక్షిత మార్గం కల్పించే అంశంపై ఇరాన్, ఒమన్ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. హోర్ముజ్‌ను తమ భూభాగంగా వాషింగ్టన్ ప్రకటిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పరిణామం ఆసక్తికరంగా మారింది. ఒప్పందంలో భాగంగా ఒమన్‌తో ఇతర అంశాలపై చర్చలు ఇంకా కొనసాగుతున్నప్పటికీ.. నౌకల సురక్షిత రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లు మాత్రం ప్రత్యేకంగా జరిగాయని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి వెల్లడించారు. అయితే అమెరికా విధించిన ఆంక్షలు, నౌకాదళ దిగ్బంధం కారణంగా హోర్ముజ్ జలసంధిలో పూర్తి స్థాయి భద్రతను పునరుద్ధరించడం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.

# ప్రతి హృదయం వందేమాతరం నినాదం



న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలోని ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. 80వ భారత స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శనివారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే స్వాతంత్ర్యం అని వివరించారు. తొలిసారిగా ఎర్రకోట వద్ద వందేమాతరం గీతాన్ని ఆలపించామని అన్నారు. దేశం కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చునని ప్రధాని మోదీ తెలిపారు. సంకల్పం, కలలు ఉన్నతంగా ఉంటే.. సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇవాళ ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తోందన్నారు. శౌచాలయాలు 4 రెట్ల వేగంతో నిర్మించామని గుర్తు చేశారు. పేదలకు ఇళ్లు 3 రెట్ల వేగంతో నిర్మించామని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెంచామని వివరించారు. ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని అన్నారు. డిజిటల్ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ వస్తువుల్లో చిప్ ప్రాముఖ్యత పెరిగిందని వివరించారు. సెమీకండక్టర్ల రంగంలో స్వావలంబన దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మూడు ప్రధాన సెమీకండక్టర్ ప్లాంట్లు కార్యకలాపాలు చేపట్టాయని గుర్తు చేశారు. ఏడెనిమిదేళ్లలో దాదాపు 8 సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోదీ తెలిపారు. 200 గిగావాట్ల అణుఇంధనం ఉత్పత్తి మన లక్ష్యమన్నారు. అలాగే ఐదు అణు రియాక్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్న?న్నామని చెప్పారు. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నామని వివరించారు. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం అని నొక్కి చెప్పారు. దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరం కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 12 ఏళ్లలో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని గుర్తు చేశారు. రైల్వే కోచ్, మొబైల్ ఫోన్ల తయారీ పెరిగిందని వివరించారు. డిజిటల్ ట్రాన్సాక్షన్స్ 100 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. ప్రతీ పని అనేక రెట్ల వేగంతో జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్‌ను 30 నుంచి వందశాతానికి పెంచామన్నారు. తాజాగా తొలి హైడ్రోజన్ రైలును కూడా ప్రారంభించామని వివరించారు. అనేక చట్టాలను మార్చామని తెలిపారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయని పేర్కొన్నారు. ముందు ఉక్రెయిన్ యుద్ధం.. ఇప్పుడు ఇరాన్ యుద్ధం అని వివరించారు. యుద్ధాలు వస్తే ఇంధనం, ఎరువులు దొరకవని కొందరు భయపెట్టారని.. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు లోటు రానివ్వలేదని చెప్పారు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి.. ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. యూరియా, డీఏపీ ధరలు పెరిగినా.. ఇక్కడ సబ్సిడీకి ఇస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. 2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్‌లు చేశామని గుర్తు చేశారు. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోందని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతులు పెరగాలని ఆకాంక్షించారు. గత 12 ఏళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు పెరిగిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి 5 రెట్లు పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 33 రెట్లు పెరిగిందని వివరించారు. భారత్ 6జీ టెక్నాలజీని ప్రపంచమంతా తీసుకెళ్లాలని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో భారత్ నుంచి 50 సంస్థలు ఉండాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. దేశంలో నక్సలిజాన్ని అంతమొందించామన్నారు. నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువకులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఎంతమంది సైనికులు చనిపోయారో.. నక్సలిజంతో అంతమంది పోలీసులు చనిపోయారని పేర్కొన్నారు. నక్సలిజం భావజాలం ఉన్నవారిని కట్టడి చేయాల్సి ఉందన్నారు. కానీ దేశంలో చాలామంది మావోవాదులు ఉన్నారని చెప్పారు. వారి మనసుల్లో మావోయిజం, నక్సలిజం ఇంకా ఉందని తెలిపారు. అలాంటి వారిని కనిపెట్టి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోటా అందాల్సి ఉందన్నారు. మహిళా బిల్లుకు సహకరించి ఆ ఘనత మీరే తీసుకోవాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం కీలకమని అభివర్ణించారు. జనగణనకు యువత సహకరించాల్సి ఉందన్నారు. జనగణన నమోదులో తప్పులు లేకుండా చూడాలని యువతకు ఆయన స్పష్టం చేశారు. అందుకోసం యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామని ప్రధాని మోదీ వివరించారు.

## ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్: డిప్యూటీ సీఎం పవన్




కాకినాడ, ఆగస్టు15: బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆయన త్రివర్ణ పతాకం ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే.. ఒక తరం కాపాడిందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పంలో ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తుందని అన్నారు. కేంద్ర సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వీకరించారు.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో వరద బీభత్సం.. నలుగురి మృతి, ఆర్మీ సిబ్బంది గల్లంతు..

అరుణాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎగువ సుబన్‌సిరి, దిబాంగ్ వ్యాలీ జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు

ఎగువ సుబన్‌సిరి జిల్లాలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో నలుగురు మృతి చెందారు. ఘటన జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు మొదలయ్యాయి. భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు సహాయక బృందాలకు సవాలుగా మారాయి. ఇక, దిబాంగ్ వ్యాలీ జిల్లాలో ఆకస్మిక వరదలు సంభవించడంతో ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతైనట్లు సమాచారం. వారిని గుర్తించేందుకు సైన్యం, స్థానిక యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టాయి వరద ప్రవాహం తీవ్రంగా ఉండటంతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది . వర్షాల కారణంగా నదులు, వాగుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన సైనికుల కోసం గాలింపు కొనసాగుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



## ఎర్రకోటలో తొలిసారి పూర్తిగా వందేమాతరం గేయం..




ఢిల్లీ, ఆగస్టు 15: దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. ఇదే సమయంలో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. దేశ చరిత్రలో ఎర్రకోటపై వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఆలపించడం ఇదే ప్రథమం. అనంతరం జాతీయ గీతం 'జన గణ మన'ను ఆలపించారు. ఆ సమయంలో భారత వాయుసేన చెందిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్ జాతీయ జెండాను.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న పతకాన్ని తీసుకెళ్లి.. ఆకాశంలో కనువిందు చేశాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్నాయి. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి కేంద్ర ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. 'వందేమాతరం' గేయాన్ని మొదటిసారిగా 1896లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారు.

## అమరావతిలో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలు.. జెండా ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 15: ఏపీ రాజధాని అమరావతిలో తొలిసారిగా స్వాతంత్ర్య వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. రాయపూడిలోని పరేడ్ గ్రౌండ్‌లో స్వర్ణాంధ్ర-2047 థీమ్‌తో వేడుకలు నిర్వహించారు. రాజధానిలో జరుగుతోన్న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుక జరిగే వేదిక వద్దకు సీఎం కాన్వాయ్‌తో బుల్లెట్ ఎస్కార్ట్ చేరుకుంది. ఈ సందర్భంగా సీఎంకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాల గౌరవ వందనాన్ని ముఖ్యమంత్రి స్వీకరించారు. ఏపీఎస్పీ సహా వివిధ పోలీసు దళాల సన్నద్ధతను చంద్రబాబు సమీక్షించారు. అనంతరం పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం.. మార్చ్ పాస్ట్ నిర్వహించాయి.

## కాకినాడ జిల్లా లో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశం ఇచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్**






**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.**
**ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాల ప్రదర్శన..**
**జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల బహుకరణ:**
**విశిష్ట సేవలకు దక్కిన గుర్తింపు.**
**242 మందికి ప్రశంస పత్రాలను అందజేసిన కలెక్టర్,ఎస్పీ**

కాకినాడ ,ఆగస్టు 15: (జిఎస్ బి వార్త) : 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు కాకినాడ జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు ఘనంగా జరగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా ప్రజల ఉద్దేశించి సందేశం ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణగావించినానంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. అనంతరం పోలీసు జాగిలాలచే ప్రదర్శన, అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల ప్రదర్శన. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) లతో పాటు.లోక్ సభ,రాజ్యసభ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య....జగ్గం పేట మరియు టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ మరియు గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభ లతో పాటు.రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామ స్వామి, డిఆర్ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ల చేతుల మీదుగాఅందజేశారు. తదుపరి జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు.. చివరిగా వందేమాతర గేయం, జాతీయ గీతాలాపనతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసాయి.








వార్త



## ఆరోగ్యకరమైన జీవన విధానం పై అవగాహన




గోకవరంఆగస్టు 15 జి ఎస్ బి వార్త : పరిరక్షణపై యువతలో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్–ఈస్ట్ గోదావరి (ఏపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పఖ్వాడా–2026 కార్యక్రమాన్ని కోరుకొండ బ్లాక్ ప్రగతి స్కూల్ నందు నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు, యువతకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తడి–పొడి వ్యర్థాలను వేరు చేయడం, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 'క్లీన్ ఇండియా–గ్రీన్ ఇండియా–హెల్తీ ఇండియా' సందేశంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో కె. ప్రదీప్ కుమార్ డైరెక్ట్ ప్రగతి విద్యానికేతన్ కె. మీనాక్షి, సి హెచ్. బుజ్జమ్మ, ఎస్ డి. భషీరా, సి హెచ్. ప్రమీల, కె. పావని తూర్పుగోదావరి మై భారత్ వాలంటీర్ కసిరెడ్డి. శాంతికుమారి వెంకటేష్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లిలో గోవింద నామస్మరణతో మార్మోగిన మాడవీధులు




ఆత్రేయపురం ( జీఎస్బీ వార్త) ఆగస్టు 15 :ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శనివారాల నోము ఆచరించే భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఏడు ప్రదక్షిణలు చేసి స్వామివారిని స్మరించుకుంటూ మాడవీధుల్లో భక్తులు ప్రదక్షిణలు చేశారు. స్వామివారి మూలవిరాట్టు, ఆరుబయట విమాన వెంకటేశ్వర స్వామి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఆండాల్ అమ్మవారు, విశ్వేశ్వర స్వామి దర్శనాలతో భక్తులు చెందారు. వేకువజామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల కోసం ఆలయంలో దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ భక్తులను భోజనాలు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఎస్సీ, ఎస్టీ పథకాలను పునరుద్ధరించాలి

### జై భీమ్‌రావ్ భారత్ పార్టీ డిమాండ్



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ వార్త : ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలను తీవ్రంగా వంచించాయని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఢ న్యాయవాది జగ్గారపు మల్లిఖార్జున ఆరోపించారు. ఈ సందర్భంగా జగ్గారపు మల్లిఖార్జున మాట్లాడుతూ రెండు ప్రభుత్వాల హయాంలోనూ దళిత, గిరిజనుల సంక్షేమం పూర్తిగా విస్మరణకు గురైందని పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ.. "గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనుల భవిష్యత్తును తీర్చిదిద్దే సుమారు 26 సంక్షేమ పథకాలను ఏకపక్షంగా రద్దు చేసింది. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఏపీ స్టడీ సర్కిల్, అంబేద్కర్ విదేశీ విద్యా నిధి వంటి కీలక విద్యా, ఉపాధి పథకాలను ఎత్తివేసి వారి అభివృద్ధిని అడ్డుకుంది" అని విమర్శించారు. అలాగే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దయిన 26 పథకాలను వెంటనే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను పూర్తిగా గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీలకు ఎస్సీ, ఎస్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే కనిపిస్తున్నారని, వారి అభ్యున్నతిపై ఏ ప్రభుత్వానికీ చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల ఆగ్రహం వల్లే గత ప్రభుత్వం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ఓటమి పాలైందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ధోరణి కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.రద్దు చేసిన 26 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ.. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడా శ్రావణ్ కుమార్ గారి అధ్యక్షతన రాబోయే సోమవారం ఉదయం 10:00 గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పథకాలను పునరుద్ధరించకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

## గోకవరంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



గోకవరంఆగస్టు 15 జి ఎస్ బి వార్త : మండలకేంద్రమైన గోకవరంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు జాతీయ జెండాను ఎగరవేశారు గోకవరం ఆర్టీసీ డిపో కార్యాలయంలో డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్ జాతీయ జెండాను ఎగరవేశారు గోకవరం పోలీస్ స్టేషన్ వద్దఎస్సై పవన్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేయడం జరిగింది.. సూది కొండ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం వద్ద రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ మరియు ఇందుకూరుపేట ఫార్ స్ట్ రేంజ్ కార్యాలయం వద్ద ర్ శీజెధికారి కొండలరావు జాతీయ జెండాని ఎగరవేశారు. ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు దుర్గ బాబు జాతీయ జెండాను ఎగరవేశారు అదేవిధంగా భూపతిపాలెం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల వద్ద పాఠశాల విద్యా కమిటీ చైర్మన్మ గళ్ళ రాము మరియు కొత్తపల్లిఆదర్శ పాఠశాల వద్ద ప్ర గ ళ్ళ లపాటీ శ్రీనివాస్ జాతీయ జెండాలు ఎగురవేశారు

## ఉత్తమ సేవలకు గాను కోరుకొండ తహసిల్దార్ సునీతకు బెస్ట్ అవార్డు...



కోరుకొండ ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త) : కోరుకొండ తహసిల్దార్ సునీత బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ అవార్డును పొందారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్,జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ తదితర రెవెన్యూ అధికారులు, ప్రజల సమక్షంలో 80 స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ఉద్యోగులు వీఆర్వోలు తదితరులు తహసిల్దార్ కు అభినందనలు తెలిపారు.

## గోకవరం పోలీసులుకు అవార్డులు పంపిణి




గోకవరం ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : స్వతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన వారికి ఇచ్చిన అవార్డ్స్ లో గోకవరం పోలీస్ స్టేషన్ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్ కి ఈరోజు గౌరవ మంత్రివర్యులు కందుల దుర్గేష్ గారి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ ఎస్పీల సమక్షంలో పురస్కారాన్ని అందుకోవడం జరిగింది.

## కలెక్టరేట్ లో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### - త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్..



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించు కుంటూ,కులమతాలకు అతీతంగా రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు.శనివారం కాకినాడ కలెక్టరేట్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తదితరులతో కలిసి 100 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలోని జాతీపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేసీ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియ, డీఆర్ఓ డా.డి.తిప్పేనాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా చిన్నారులకు ఆయన చాక్లెట్లు పంచిపెట్టి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతో మంది మహనీయుల ఆత్మబలిదానం, స్వాతంత్ర్య సమరయోధుల అచంచల దేశభక్తి ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామన్నారు. ఆ త్యాగధనుల ఆశయాలను గౌరవించడం మన బాధ్యతని ఆయన తెలిపారు. మనకు లభించిన ఈ స్వాతంత్ర్య ఫలాలను సద్వినియోగం చేసుకుంటూ, జాతిని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం అంటే కేవలం పరాయి పాలన నుండి విముక్తి మాత్రమే కాదు, అది మన రాజ్యాంగం ద్వారా సామాన్యుడికి లభించిన సామాజిక, ఆర్థిక అని పేర్కొన్నారు. మహనీయులు రూపొందించిన రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను, బాధ్యతలను గుర్తుంచుకుంటూ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా, దేశం కోసం పోరాడినసమరయోధులను స్మరించుకుంటూ,వారి ఆశయాలను మన ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో పాటించాలన్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం అనే రెండు ప్రధాన లక్ష్యాలతో, అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపై నిలిచి మన రాష్ట్రాన్ని జిల్లాను 'స్వర్ణాంధ్ర'గా తీర్చిదిద్దు దామని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 15% వృద్ధి రేటును అందుకోవడంలో ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్య మంత్రి నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్క పౌరుడు తన వంతు సహకారాన్ని అందించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం డబుల్ ఇంజన్ సర్కార్ గా సాగుతూ, రాబోయే రోజుల్లో మన జిల్లాను, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు సంకల్పం తీసుకుందామని ఈ సందర్భంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కాకినాడ జిల్లా వాసులందరికీ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీత బాబు వర్ధంతి కార్యక్రమానికి హాజరైన తోట.

గోకవరం ఆగస్టు1 5 జి స్ బి వార్త : మండల కేంద్రమైన గోకవరం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం సెక్రటరీ దాసరి చినబాబు, సోదరుడు దాసరి సీత బాబు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం హాజరై సీత బాబు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గుల్లా ఏడుకొండలు,జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు కాపు సంఘం అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావు (రమణ) గోకవరం గోకవరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు బాడితబోయిన చిన్న, గోకవరం మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నండూరి బుజ్జి, తుమ్మల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్డీవో కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని ఆర్డీవో మల్లిబాబు పిలుపు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, 3 నిమిషాల 16 సెకన్ల పూర్తి స్థాయి 'వందేమాతరం' గీతాలాపనతో ప్రత్యేకత అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, మిఠాయిల పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఎందరో మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆదర్శాలను నిత్య జీవితంలో అలవర్చుకోవాలని ఆర్డీవో పిలుపునిచ్చారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతోనే సమాజంలో గుణాత్మక మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, చాక్లెట్లను పంపిణీ చేసి వారిని అభినందించారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన 3 నిమిషాల 16 సెకన్ల పూర్తి స్థాయి 'వందేమాతరం' గీతాలాపనతో ఈసారి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. "ఆలోచిద్దాం – ఆచరిద్దాం" అనే సంకల్పంతో 'వికసిత భారత్' దిశగా ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తూ, గత మూడు రోజులుగా సాగిన తిరంగా యాత్రలు, చారిత్రక ఘట్టాల పునరుద్ధరణ కార్యక్రమాలు ఉత్సవాల్లో సరికొత్త స్ఫూర్తిని నింపాయి. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జె.బి.పి ఆధ్వర్యంలో 80వ స్వతంత్ర దినోత్సవం వేడుకలు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి : జై భీమ్ రావ్ భారత్ పార్టీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లికార్జున ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎందరో మహాను బావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని జగ్గారపు మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు. బాగా చదువుకోవడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుం దన్నారు. దేశంలో రాష్ట్రాలు అన్ని రంగాల్లోని అభివృద్ధి చెందా లన్నారు. దళితులకు ఇవ్వాల్సిన పథకాలను పునఃరుద్ధరించాలని విజయవాడలో జేబీపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెబిపి పార్టీ నాయకులు, న్యాయవాదులు మరియు వివిధ సంఘాల నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా స్వాతంత్ర్య వేడుకల్లో 108 సిబ్బందికి ఘన సత్కారం



అడ్డతీగల,(జిఎస్ బి వార్త)ఆగస్టు15: పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరం లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 108 అత్యవసర సేవల విభాగానికి చెందిన సిబ్బందిని విశిష్ట సేవలకు గుర్తింపుగా ఘనంగా సత్కరించారు. అడ్డతీగల చెందిన ఈఎంటి వెంకట్,పైలట్ నవాజ్ అత్యవసర సమయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి,జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రమాదాలు, అనారోగ్య అత్యవసర పరిస్థితులు వంటి సందర్భాల్లో బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడడంలో 108 సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించడంలో అంకితభావంతో పనిచేస్తున్న వెంకట్, నవాజ్‌ల సేవలను అధికారులు అభినందించారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసర సమయంలో సేవలందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా మరింత అంకితభావంతో సేవలు అందిస్తామని తెలిపారు.తమ సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించిన జిల్లా కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. అడ్డతీగల 108 సిబ్బందికి లభించిన ఈ పురస్కారం తోటి సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నింపింది.ప్రజా సేవలోఅంకితభావంతో పనిచేస్తున్న 108 సిబ్బందికి పలువురు అభినందనలు తెలిపారు

## ఏపీఎన్జీవో భవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

### పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల డిమాండ్

కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : కాకినాడ జిల్లా కేంద్రంలోని ఏపీఎన్జీవో భవనంలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కుద్దేటి రామ్మోహనరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రామ్మోహన్, మూర్తి బాబు మాట్లాడుతూ, ఎందరో మహానుభావుల త్యాగఫలమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తారని స్పష్టం చేశారు. అంతేకాక ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలి. నూతన పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమించి, ఉద్యోగులకు ఐఆర్ (తాత్కాలిక భృతి) ప్రకటించాలి.ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ద్వారా చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గాంధీ పార్క్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : కాకినాడ గాంధీనగర్‌లోని గాంధీ పార్క్ వద్ద శ్రీ పద్మారామ్ ఎల్.ఎం.ఎఫ్ క్లబ్ (అసోసియేషన్ ఆఫ్ అలయం క్లబ్ ఇంటర్నేషనల్) ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ వనం శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు కాకర్లపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి అనసూరి గోపాలకృష్ణ, కోశాధికారి కొమ్మన తాతారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవను నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. "సేవే మా లక్ష్యం – పచ్చదనం మన బాధ్యత" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణకు, సమాజ హితానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం దేశభక్తి నినాదాలు చేస్తూ జైహింద్, జై భారత్ అంటూ వేడుకలను ముగించారు.

## దేశభక్తి, సమైక్యతా స్ఫూర్తితో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



అమలాపురం, ఆగస్టు 15( జి ఎస్ బి వార్త) : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అమలాపురం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవితో కలిసి స్వాతంత్ర్య సమరయోధులు, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 10 కోట్ల మత్తు రహిత ప్రతిజ్ఞలు దేశవ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా, మిషన్ స్పందన్, బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "10 కోట్ల మత్తు రహిత ప్రతిజ్ఞలు" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, వారి స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనేది కేవలం హక్కులను పొందడం మాత్రమే కాదని, దేశం పట్ల బాధ్యతలను నిర్వర్తించడం కూడా అని అన్నారు.

## డాక్టరేట్ అవార్డు గ్రహీత అబ్బులును సన్మానిస్తున్న తాహసిల్దార్ మూర్తి



ఆత్రేయపురం (జిఎస్బి వార్త) ఆగస్టు 15 : రెవెన్యూ శాఖలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ గత 36 సంవత్సరాలుగా క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో విశేష సేవలందిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్న తాతపూడి అబ్బులును మండల తహసీల్దార్ రామచంద్ర మూర్తి అధ్యక్షతన రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమ రెవెన్యూ శాఖకు గర్వకారణమని, అబ్బులు నేటి యువతకు, ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అబ్బులు క్రీడాకారుడిగా మాత్రమే కాకుండా మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడిగా, నిర్వాహకుడిగా ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దుతూ వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నారని, క్రీడల అభివృద్ధితో పాటు సమాజ సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్నారని అధికారులు కొనియాడారు. అబ్బులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో పాటు నేషనల్ ఎక్సలెంట్ మాస్టర్ అవార్డు, నంది అవార్డు, గౌరవ డాక్టరేట్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. అలాగే గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తింపుతో పాటు పలు మార్షల్ ఆర్ట్స్ సంస్థల్లో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు వంటి బాధ్యతలు నిర్వహిస్తూ క్రీడారంగానికి విశేష సేవలందిస్తున్నారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ మరోవైపు క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతున్న అబ్బులు సేవలు అభినందనీయమని, ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్షించారు.

## అమలాపురం ప్రెస్ క్లబ్‌లో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

అమలాపురం ఆగస్టు 15 ( జి ఎస్ బి వార్త ): భారత 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లిఅమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర సంగ్రామంలో పత్రికారంగం, ద్రశ్య–శ్రావ్య మాధ్యమాలు మరియు విలేకరులు పోషించిన పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. స్వాతంత్రం సిద్ధించిన నాటి నుంచి నేటి వరకు సమాజంలో చైతన్యం నింపడంలో, దేశాభివృద్ధిలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల కృషి అభినందనీయమని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ, దేశ పురోగతిలో విలేకరులు తమవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు స్వయంగా ముందడుగు వేసి ఈ వేడుకను ఎంతో ఉత్సాహంగా ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే ఆనందరావు గారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులకు, అమలాపురం నియోజకవర్గ ప్రజలకు ఆయన 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, వివిధ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.



## కాకినాడ నగరపాలక సంస్థలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : కాకినాడ శారదమ్మ గుడి సమీపంలోని కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అంతకుముందు జాతిపిత మహాత్మా గాంధీ , భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కమిషనర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా కాకినాడ నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించిన "స్వచ్ఛ కాకినాడ" లక్ష్యాన్ని సాధించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కాకినాడను పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన, ప్లాస్టిక్ రహిత, ఫ్లెక్సీ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం నగరపాలక సంస్థలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులను కమిషనర్ అభినందించి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్ఈ పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, కాకినాడ స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ వేణు, ఉద్యానవన శాఖ ఏ.డి. శ్రీనివాసరావు, మేనేజర్ శిరీష్ కుమార్, టి.పి.ఆర్.ఓ. సతీష్, సెక్రటరీ లక్ష్మి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఆత్రేయపురం (జి ఎస్ బి వార్త) ఆగస్టు 15 : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఎంపీ డీఓ శ్రీ పి.వి.ఆర్.కె. రాజు గారి అధ్యక్షతన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి కుండా అన్నపూర్ణ గారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతిపిత మహాత్మా గాంధీతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. శ్రీమతి కుండా అన్నపూర్ణ మాట్లాడుతూ దేశానికి స్వేచ్ఛను అందించిన మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం మనందరి అదృష్టం. స్వాతంత్ర్యం ఇచ్చిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి, దేశాభివృద్ధి, సామాజిక సమగ్రత, ప్రజా సేవకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేసారు. ఎంపిడిఓ పి.వి.ఆర్.కె.రాజు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం మనకు హక్కులను మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, మండల విద్యాశాఖాధికారి, పి.వి.ప్రసాదరావు, ఎపిఒ సి.హెచ్.విజయ రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, మరియు ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: అలయన్స్ క్లబ్ ప్రతినిధులు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ – శ్రీ పద్మారావు ఎల్.ఎం.ఎఫ్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ కే.వి.వి. సత్యనారాయణ సహకారంతో, శ్రీ పద్మారావు ఎల్.ఎం.ఎఫ్ క్లబ్ అధ్యక్షులు కాకర్లపల్లి వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి అనసూయ గోపాలకృష్ణల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. సుమారు 100 మందికి పైగా నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి ఉద్యోగులు, క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ఆసుపత్రి ప్రాంగణంలో పలు రకాల నీడనిచ్చే, ఔషధ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ వనం శ్రీనివాసరావు, కొమ్మన తాతారావులతో పాటు సివిల్ అసిస్టెంట్ వైద్యులు డాక్టర్ మెహర్ కుమార్, డాక్టర్ లావణ్య రావు, నర్సింగ్ సూపరింటెండెంట్, హెల్త్ ఇన్స్పెక్టర్లు గోపాలకృష్ణ, గంగరాజు, శానిటరీ సివిల్ ఇన్స్పెక్టర్ బాల్ రావు తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం ఆగస్టు 15 ( జి ఎస్ బి వార్త ) 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అవార్డుల ప్రధానం ఉత్తమ ఇంజనీరు అవార్డును మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ మీనా ల నుంచి అందుకున్న అమలాపురం పంచాయతీరాజ్ డిఇ అన్యం రాంబాబు... ఊడిమూడి...పెదపూడి లంకల మధ్య గోదావరి నది పై ప్రతిష్టాత్మక వారధి నిర్మాణం, కాయిర్ టెక్నాలజీ రాష్ట్ర స్థాయిలో మొదటి సారి కోనసీమ లో ఇంప్లిమెంట్ చేసినందుకు రాంబాబు ని ఉత్తమ సేవా పథకానికి ఎంపిక చేశారు.

## ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న వాడపల్లి డిప్యూటీ కమిషనర్



ఆత్రేయపురం ( జీఎస్ బి వార్త) ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా శ్రీయుత జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మన వాడపల్లి డిప్యూటీ కమీషనర్ నల్లంసూర్య చక్రధర రావు .

## కాకినాడ టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నాయకులు, కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ, టౌన్ పార్టీ అధ్యక్షులు మల్లిపూడి వీరు హాజరై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. జెండా ఆవిష్కరణ తర్వాత నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు పంచిపెట్టి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో జాతీయ స్ఫూర్తి, దేశభక్తి వెల్లివిరిసింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని గుర్తుచేశారు. దేశం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలు, స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. దేశ సమగ్రత, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతూ సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా, అమరవీరుల స్ఫూర్తితో నిరంతరం ప్రజలకు సేవ చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చివరగా, నాయకులు మరియు కార్యకర్తలు దేశ ఐక్యత, సమగ్రత కోసం నిరంతరం కృషి చేస్తామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకల్లో టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు గదులు సాయిబాబా, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ ఖాన్, మల్లాడి గంగాధర్, పిల్లి రాముడు, సీకోటి అప్పలకొండ, సబ్బతి పనేశ్వరరావులతో పాటు భారీ సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా మన ఐక్యతకు చిహ్నం - భవిష్యత్తుకు మార్గదర్శకం.

### 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో వనమాడి మోహన్ వర్మ, మల్లిపూడి వీరు



జగన్నాధపురం శాసనసభ్యులు వనమాడి కొండబాబు గారి కార్యాలయం నందు జాతీయ జెండాను ఆవిష్కరించిన వనమాడి మోహన్ వర్మ, మల్లిపూడి వీరు ఎన్నో దశాబ్దాల పోరాటం, ఎన్నో తరాల ఉద్యమం, ఎందరో మహనీయుల ఆత్మ బలిదానాల ఫలితం మన స్వాతంత్ర్యం అని, జాతీయ జెండా మన ఐక్యతకు చిహ్నం, భవిష్యత్తుకు మార్గదర్శకం అని తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమడి మోహన్ వర్మ, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు పేర్కొన్నారు. 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో జగన్నాధపురం శాసనసభ్యులు వారి క్యాంపు కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమడి మోహన్ వర్మ, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ పతాకాని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జగన్నాధపురం చర్చి స్కేర్ సెంటర్ నుండి దేవాలయం వీధి మీదుగా జిల్లా పరిషత్ సెంటర్, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం వరకు తిరంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమడి మోహన్ వర్మ మల్లిపూడి వీరు మాట్లాడుతూ జాతీయ జెండా మన ఐక్యతకు చిహ్నం, భవిష్యత్తుకు మార్గదర్శకం అని, ఎన్నో దశాబ్దాల పోరాటం, ఎన్నో తరాల ఉద్యమం, ఎందరో మహనీయుల ఆత్మ బలిదానాల ఫలితం మన స్వాతంత్ర్యం అని, నాటి సమరయోధుల ఆశయ సాధనలో భాగంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తూ, సమాజంలోని అన్ని వర్గాల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా వికసిత్ భారత్ ను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలపిల్లి విద్యాసాగర్, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, చొక్కా గిరి, అరదాడి శివ, పినపోతు దుర్గారావు, పినపోతు రాము, పినపోతు జీవారత్నం, పట్టా ధనలక్ష్మి, ఓలేటి పాండురంగడు, పాలెపు రాజు, బలసాడి శ్రీను, ఆదం సతీష్, బొడ్డు శివాజీ, కామాడి సుబ్బారావు, మల్లాడి గంగాధరం, ధర్మారావు, పొంగ బుజ్జి, కటౌట్ శ్రీను, వనమాడి కృపా వర్మ, తదితరులు పాల్గొన్నారు.

## మువ్వన్నెల జెండాను రేపరెప లాడించి...



యు కొత్తపల్లి ఆగస్టు 15(జి ఎస్ బి వార్త )యు కొత్తపల్లి మండలంవాకతిప్ప గ్రామానికి చెందిన చీపూరి బుచ్చిరాజు అనునిత్యం బట్టలు కుడుతూ దర్జీగా కొనసాగుతున్నాడు 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అయన దుకాణం పై జాతీయ జెండాను రేపరేపలాడించి తనయాంత్రిక జీవనంలో లీనామయ్యాడు. దర్జీని నిజమైన దేశ భక్తునిగా భారత పౌరునిగా మనం భావించవచ్చు సుమారు 50 సంవత్సరాలుగా దర్జీగా కొనసాగుతూ తొలుత భారతీయునిగా మువ్వన్నెల జెండాకీ వందనము సమర్పించిన బుచ్చిరాజు భావితరాల వారికీ ఆదర్శంగా నిలిచారు

# దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన 'శ్రీ బాలాజీ ఏజెన్సీస్' అధినేత బచ్చి శేఖర్



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ నగర ప్రజలతో పాటు యావత్ భారత పౌరులకు 'శ్రీ బాలాజీ ఏజెన్సీస్' (బీపీసీఎల్ పెట్రోల్ బంక్) అధినేత బచ్చి శేఖర్ హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడ బాలాజీ చెరువు సమీపంలోని ఎంఆర్వో కార్యాలయం ( ఎదురుగా ఉన్న తమ బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకుని నగర ప్రజలందరూ సుఖసంతోషాలు, శ్రేయస్సుతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# కొత్తపల్లిలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



యు కొత్తపల్లి ఆగస్టు 15( జి ఎస్ బి వార్త )పిఠాపురం నియోజకవర్గం యు కొత్తపల్లి మండలంలో అన్ని గ్రామాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎం పీ పి కారే సుధాశ్రీనివాస్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చిన్నారావు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ ఐ వెంకటేష్, పాఠశాలలో ను మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. కొత్తపల్లి ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులు సోల్జర్స్ భారతమాత వేసాధారణ లలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా. పలువురు మాట్లాడుతు స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటీష్ వారితో ఎలా పోరాడి స్వాతంత్ర్యం తీసుకొచ్చారో పిల్లలకి వివరించారు. ఈనాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా సిద్ధించింది

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



అమలాపురం ఆగస్టు 15 ( జి.ఎస్.బి వార్త) : 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ మద్దెల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో త్రివిధ దళాల్లో సేవలందించి పదవీ విరమణ చేసిన ఎక్స్ ఆర్మీ హానర్ కెప్టెన్ లయన్ నడింపల్లి అప్పలరాజు, ఎక్స్ ఎయిర్‌ఫోర్స్ ఎస్‌జీటీ నజీర్ షబ్ హుస్సేన్, ఎక్స్ నేవీ సీపీఓ పెచ్చేటి చంద్రరావులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, దేశానికి వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అనంతరం బ్రహ్మకుమారీస్ ఓం శాంతి సభ్యులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "10 కోట్ల మంది వ్యసన ముక్తి ప్రతిజ్ఞ" కార్యక్రమంలో భాగంగా, కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, లయన్స్ క్లబ్ సభ్యులతో వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్ అనిల్ కుమార్ పి ఎం జె ఎఫ్ , రీజియన్ చైర్‌పర్సన్ లయన్ జంపన సుమన్ వర్మ ఎం జె ఎఫ్ , క్లబ్ కార్యదర్శి లయన్ పూజ అనిల్ జైన్ ఎం జె ఎఫ్ , లయన్ వరదా శ్రీరామ చంద్రమూర్తి, లయన్ పట్నాల వెంకట రమణ మల్లికార్జునరావుతో పాటు పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకుంటూ, దేశ సేవలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు.లి

# శ్రీరంగపట్నం సరస్వతి విద్యానికేతన్ లో కరస్పాండెంట్ పెనకటి శివాజీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు...

కోరుకొండ ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త) : శ్రీరంగపట్నం సరస్వతి విద్యానికేతన్ లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా కరస్పాండెంట్ శివాజీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజానగరం మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు మాజీ జెడ్పిటిసి సభ్యులు మల్ల అప్పల నరసరావు గారు సర్పంచ్ మద్దాల రమణ ఎక్స్ సర్పంచ్ బుద్ధ శ్రీను బిజెపి నాయకులు మరియు కూటమి నాయకులు ఇచ్చేసే శ్రీ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరావు గారి చే ఫ్లాగ్ హోస్టింగ్ చేయించి తర్వాత బహుమతి ప్రధానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో గొప్ప విశేషం ఏమిటంటే సరస్వతి విద్యానికేతన్ శ్రీరంగపట్నం ప్రభుత్వ గుర్తింపు పొందిన తర్వాత2007 లో ప్రథమంగా నవోదయ సీట్ సాధించిన విద్యార్థి మళ్ళా ఆశ్రిత ఈరోజు జూనియర్ లెక్చరర్గా సెలెక్ట్ వెంటనే 15 రోజులలో మరల డిగ్రీ కాలేజీ లెక్చరిగా కూడా సెలెక్ట్ అయింది దీనికి కారణంగా ఈ అమ్మాయిని విద్యార్థులు అందరూ ఇన్స్పిరేషన్ గా తీసుకుంటారని ఉద్దేశంతో ఈ అమ్మాయికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఘనంగా శ్రీరంగపట్నం గ్రామ పెద్దలు చే చిరు సత్కారం చేయడం జరిగింది తర్వాత సరస్వతి విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల డిబేట్ కాంపిటీషన్ డాన్స్ కాంపిటీషన్ సాంగ్స్ విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమం ఎంత దిగ్విజయంగా జయప్రదం చేసిన మా ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి రాజా, కె కుమారి, కె రమ్య కృష్ణ, ఎస్ తేజస్విని, హైమావతి, బ్రహ్మం, సురేఖ, లావణ్య, రేణుక, వరలక్ష్మి, దయానా, సరిత, నాగలక్ష్మి మౌనిక శ్రీదేవి, దేవి, పార్వతి, గౌరీ తదితర ఉపాధ్యాయ బృందంతో పాల్గొన్నారు.



# స్వతంత్ర ఫలాలు అందరివీ కావాలి...!

ఘనంగా 80వ స్వతంత్ర వేడుకలు



సామర్లకోట, ఆగస్టు 15, జి ఎస్ బి వార్త : ఎందరో త్యాగ ఘనుల ఫలితాలు ప్రజలందరివీ కావాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. 80వ భారత స్వాతంత్ర వేడుకలు సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో శుక్రవారం ఘనంగా జరిగాయి. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం లో కమిషనర్ ఎన్ కనకా రావు, ప్రత్యేక అధికారి రత్నమణి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డా. కార్తిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే చిన రాజప్ప పాల్గొని జాతీయ పతకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాష్యత విషయంలో దేశం నూరు శాతం ఫలితాలను సాధిస్తే స్వతంత్ర యోధుల కలలు నెరవేరునట్టు అవుతుందన్నారు. దానికిగాను ప్రస్తుతం విద్యార్థులుగా ఉన్న పిల్లలంతా విద్యలో రాణించాలన్నారు. స్వతంత్ర సాధనకు పాటుపడిన నేతలను ఎన్నడూ మరవకుండా వారి బాటలో ప్రతివారు నడవాలన్నారు. కాగా తహశీల్దార్ కార్యాలయాల్లో తహశీల్దార్ కె చంద్ర శేఖర రెడ్డి, వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపిడివో ఆధ్వర్యంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, జడ్పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్ లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే పెద్దాపురం ఎంపిడివో కెవి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీపీ పెంకె వెంకటలక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో శ్రీధర్ రెడ్డి లు, డి ఎస్పీ కార్యాలయంలో డి ఎస్పీ ఏ బి జి తిలక్, ఆర్డివో కార్యాలయంలో ఆర్డివో కృష్ణమూర్తి, పోలీస్ స్టేషన్ లలో సిఐ లు ఎ కృష్ణ భగవాన్, వై ఆర్ కె శ్రీనివాసరావు లు, సామర్లకోట బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గం ఇంచార్జి డా. గౌరకపూడి చిన్నయ్యదొర, సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో ప్రిన్సిపాల్ కె ఎన్ వి ప్రసాదరావు, రైల్వే స్టేషన్లో స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ లు జాతీయ పతాకాలు ఎగురవేసి వేడుకలు జరిపారు. కాగా సామర్లకోట మున్సిపాలిటీలో సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ వేడుకల్లో కూటమి నాయకులు రాజా సూరిబాబు రాజు, అందుగుల మణికుమారి, అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, బలుసు వాసు, సరోజ వాసు, మంచెం సాయి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కౌన్సిలర్ లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కంబాల శ్రీనివాసరావు

ప్రజా సేవకు పెద్దపీట..... నాయకులు కార్యకర్తలు, అభిమానులల్లో హర్షం...



గోకవరం ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సీఎండీ కార్యాలయం వద్ద నిర్వహించిన, విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, హిందూధర్మ పరిరక్షణకు, పేదల సంక్షేమానికి చేస్తున్న కృషికి గాను, పార్టీ అధిష్టానం రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించిందన్నారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ శుక్రవారం అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేసారని పేర్కొన్నారు. జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 గా బాధ్యతలు తీసుకున్న తాను నియోజకవర్గం వ్యాప్తంగా 248 మందిని బీఎల్ఏ-2 లను నియమించి, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం నిర్వహించిన, సర్ ప్రోగ్రాంన్ని నియోజకవర్గ గ్రామాలోని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంలో ముందున్నామన్నారు. ఈ విధంగా చేస్తున్న పలు సేవలకు రాష్ట్ర అధ్యక్షులు పీ.వి.ఎన్ మాధవ్, దగ్గుబాటి పురందేశ్వరి, సోము వీర్రాజు, బిక్కిన విశ్వేశ్వరరావు, పిక్కి నాగేంద్ర, ఆకుల శ్రీధర్ నాయకుల విశ్వాస ప్రతికగా ఈ పదవి లభించటం జరిగిందన్నారు. భారతీయ జనతా పార్టీ దేశంలోనే అతి పెద్ద పార్టీ ,మరియు సిద్ధాంతాలు కలిగిన పార్టీ అన్నారు. పార్టీలో సహనం, ఓపికతో కష్టపడి పని చేసే వారికి ఎప్పుడు కూడా సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీ పట్ల నేను మొదటి నుంచి కూడా క్రమశిక్షణ పద్ధతిలో పనిచేస్తూ వెళ్లానని, తన పద్ధతిని క్రమశిక్షణ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఈ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అలాగే జగ్గంపేట, రంపచోడవరం, రాజానగరం మూడు నియోజకవర్గల్లో విద్య, వైద్య, ఆర్థికపరంగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం, శ్రావణి మాసం సందర్భంగా గత నెల 11వ తేదీ నుంచి ఇప్పటి వరకు 70,000 వేలు పట్టు చీరలు పంపిణీ చేశామని, అలాగే మూడు నియోజకవర్గాల్లో4 వేలు బంగారు వరలక్ష్మి రూపులు పంపిణీ చేస్తున్నమన్నారు. ఈ పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ కి, అగ్రశ్రేణి నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కంబాల శ్రీనివాసరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాషాయ శ్రేణుల్లో, ధార్మిక వర్గాల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పలు గ్రామాల నుంచి ప్రజలు ఆయన వద్దకు వచ్చి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు...

# గత 30 ఏళ్ల గా విద్యార్థుల కు 1984-85 పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సహం

కరప (జిఎస్ బి వార్త) : స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో మండల కేంద్రం కరపలో నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 1984-85 సంవత్సర 10వ్త బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం గత 30 సంవత్సరాలుగా విద్యా ప్రోత్సహం చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండా సూర్యారావు శనివారశీ 10వ్త క్లాస్ టాపర్స్, స్కూల్ ఫస్ట్ పైల వెంకట దిలీప్ 5000/-,స్కూల్ సెకండ్ గొర్రెల జయశ్రీ 3000/-, స్కూల్ థర్డ్ నల్లా సత్య సంతోష్ 2000/- అందించారు. ఈ కార్యక్రమం లో స్కూల్ హెచ్ ఎం రాజేశ్వరి , విద్యా కమిటీ చైర్మన్ దేవు దుర్గారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, కూనంరెడ్డి శ్రీను, దేవు వెంకన్న, 1984-85 పూర్వ విద్యార్థులు ఆకుల వెంకట శ్రీనివాస్, వత్సవాయ వెంకటపతి రాజు, బొల్లంరెడ్డి రాంబాబు, అరుమిల్లి దొరబాబు, నక్కా ప్రసన్న లక్ష్మీ, డాక్టర్ శ్రీదేవి,హైస్కూల్ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ నల్లదొరలపై యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి : ఏఐవైఎఫ్

ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలుఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై. బాబి పిలుపు



కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : దేశంలో కార్పొరేట్ వ్యవస్థలు నల్లదొరల రూపంలో ప్రజలను పట్టిపీడిస్తున్నాయని, వారి దోపిడీపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి వై. బాబి పిలుపునిచ్చారు. కాకినాడ ఆర్టీవో ఆఫీస్ ఆవరణలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై. బాబి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాల సాధనకు పోరాట బాట పట్టాలని అన్నారు. నాడు తెల్లదొరలను తరిమికొట్టి స్వాతంత్ర్యం సాధించుకున్నప్పటికీ, నేడు కార్పొరేట్ శక్తులు పేదలను పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా పేదరికం, బానిసత్వం ఇంకా సమసిపోలేదని పేర్కొన్నారు. సరైన నీడ లేక, కడుపునిండా తిండి దొరక్క నిత్యం ఎందరో ఆకలితో అలమటిస్తూ మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎం. వీరబాబు, ఇ. మధు, కొండల నాగేష్, బి. బంగార్రాజు, ఎలుబండి వీరేష్, పొన్నాడ దుర్గాప్రసాద్, సింహాద్రి, ధోని ప్రసాద్, సిహెచ్. అశోక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల మండలంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



అడ్డతీగల,(జిఎస్‌బి వార్త)ఆగస్టు15: అడ్డతీగల మండలంలోని అన్ని గ్రామాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, విద్యాసంస్థలు, బేస్ క్యాంపస్, సెయింట్ మేరీస్ విద్యాసంస్థల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఎ.వి.వి.కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొని జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేటమామిడి బేస్ క్యాంప్ వద్ద నిర్వహించిన వేడుకల్లో అడ్డతీగల సిఐ గజేంద్ర కుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ సిబ్బంది దేశభక్తిని చాటుతూ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చీఫ్ జస్టిస్ మురళి గంగాధర్ రావు పాల్గొన్నారు. స్థానిక అడ్డతీగల మండల కేంద్రంలో గల ఎల్లవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు బూర్లె హరిబాబు ఆధ్వర్యంలో జాతీయ జెండా అవిష్కరించారు. అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి.మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో జెండా వందన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని,ఎంతోమంది తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని విద్యార్థులకు వివరించారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్య ఫలాలు ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు.

దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని వారు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ,దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని ప్రాంతాల్లో జాతీయ జెండాలు రెపరెపలాడగా, దేశభక్తి నినాదాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కరప లో వాడవాడల మువెన్నల జండా వందనాలు తో దేశభక్తి చాటిన అధికారులు, నాయకులు



కరప (జిఎస్ బి వార్త) : కరప లో శనివారం 80వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మి సరస్వతి, ఆర్ ఐ పవన్,వీఆర్వో, సిబ్బంది తో జెండా వందనం చేశారు. ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీడీఓ జె శ్రీనివాస్, డిప్యుటీ ఎంపీడీఓ లు సలాది శ్రీనివాస్ రావు, కర్రి శ్రీనివాస రావు లు, సిబ్బంది తో కలసి జెండావందనం చేశారు. బీసీ గురుకుల పాఠశాల లో డాక్టర్ బొండ సూర్యారావు, మాజీ సర్పంచ్, ప్రిన్సిపాల్ విద్యార్థుల తో మార్చ్ ఫాస్ట్ చేయించి జాతీయ గీతలాపన చేయించారు. కరప మార్కెట్ కమిటీ లో చైర్మన్ ముద్రగడ రమేష్ ఆధ్వర్యంలో జండావందనం చేశారు. కరప హైస్కూల్ లో హెచ్ ఎం రాజ రాజేశ్వరి విద్యార్థుల తో జండా వందనం చేశారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శి లు జండావంధానం చేశారు. కార్యాలయాలు కు మువెన్నల రంగులు తో విద్యుత్ వెలుగు తో జాతీయ భావం పెంపోందించారు. కరప మండలం పెనుగుదురు లో తుమ్మల పల్లి వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ తో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విద్యార్థుల కు ఉత్తమ బహుమతిలు ను మాజీ ఎంపీటీసీ తుమ్మల పల్లి మాచరావు అందించారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు ప్రత్యేకంగా స్వతంత్ర్యవేడుకలు నిర్వహించారు.



Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృశ్యమాలిక


























# ఘనంగా అక్షర ధామ్ ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ లో 80 వస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.....



ఐ. పోలవరం ఆగస్ట్ 15( జియస్ బి వార్త)ఐ. పోలవరం మండలంలోని స్థానిక అక్షర ధామ్ ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ లోకరస్పాండెంట్ శేషా గిరి అధ్యక్షత న 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా జాతీయ జెండా ఎగురవేసి స్వతంత్ర సమారాయోధుల త్యాగాల కోసం విద్యార్థులు కు తెలియజేసారు అనంతరం ర్యాలీ నిర్వహించి విద్యార్థుల కు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అక్షర ధామ్ ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ ఉపద్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల పిల్లలకు విద్యాప్రోత్సహకాలు



అక్కయ్యపాలెం జంక్షన్, : ప్రపంచ వ్యాప్తంగా విద్యతోనే అపార ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ ఏజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు లిగంట్ల శ్రీనుబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం అక్కయ్యపాలెంలోని తన కార్యాలయంలో 9 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలను గంట్ల శ్రీనుబాబు అందజేశారు. సిఏ విద్యాభ్యాసం సాగిస్తున్న సిహెచ్ అమృత యాదవ్ , వైఎస్ ఎన్ ఎస్ లిఖిత్ (పదోతరగతి), సిహెచ్ మనోజ్ యాదవ్ (9వతరగతి), కె.జోషఫ్ రాజు(8వతరగతి) బి.హర్షిత్ రామ్ (4వతరగతి), కొల్లి జైస్వాల్ (ఎల్ కెజి), ఎస్.భవదీప్ (రెండోతరగతి), ఎస్. గుణదీప్ (యుకెజి), కొల్లి మహాన్ష్ (రెండోతరగతి) తదితరులకు ప్రశంసా పత్రం, నగదు, ఇతర ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు క్రమం తప్పకుండా ఉపకార వేతనాలను అందజేస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది లిజూన్ 28న 152 మందిపిల్లలకు ఉపకార వేతనాలు అందజేశామన్నారు. ఆ తరువాత దశల వారీగా మరో 30 మంది పిల్లలకు కూడా విద్యా ప్రోత్సాహకాలను అందజేస్తూ రావడం జరిగిందన్నారు. ఇందులో నలుగురు బీటెక్ విద్యార్థులకు గత మూడేళ్లుగా తాను సొంతంగా ఫీజులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అలాగే వివిధ తరగతుల్లో విద్యాభ్యాసం సాగిస్తున్న వారిని తన పరిధి మేరకు ఆర్థిక సాయం చేసి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో కులాలు, మతాలు, యూనియన్ లకు ప్రమేయం లేదన్నారు. గత కొన్నేళ్లుగా తాను ఈ కార్యక్రమాన్ని తన పరిధి మేరకు నిర్వహిస్తూ వస్తున్నట్లు గంట్ల శ్రీనుబాబు చెప్పారు. ప్రతిభను ప్రోత్సహించడం, పిల్లల్లో ప్రతిభా పాటవాలను గుర్తించడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఇటువంటి విద్యాప్రోత్సాహకాల వల్ల వారిలో నూతన ఉత్సాహం కలగడంతో పాటు భవిష్యత్తులో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. దేశ, విదేశాల్లో ఎక్కడ స్థిరపడిన వారికి తాము ఎప్పుడూ జ్ఞాపకంగా ఉంటామని అదే తనకు ఆత్మసంతృప్తి కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహణ.

**రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు డా. నిమ్మల రామానాయుడు.**
**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



భీమవరం, : భీమవరం కలెక్టరేట్ ఆవరణలోని పెరేడ్ గ్రౌండ్ లో శనివారం ఏర్పాటు చేసిన 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు డా. నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి జాతీయ జండాను ఆవిష్కరించ్చారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు డా. నిమ్మల రామానాయుడు 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగిస్తూ, పశ్చిమ గోదావరి జిల్లా లో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి తెలియచేసారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ ముందు గా జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులందరికీ ఘన నివాళులు అర్పించారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్--2047' లక్ష్యంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయం, పారిశ్రామిక, పర్యాటక, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలో పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.

జలవనరుల రంగం ద్వారా పశ్చిమ డెల్టాలో 4,03,001 ఎకరాల ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. సుమారు 2,220 కిలోమీటర్ల కాలువల ద్వారా టెయిల్ ఎండ్ భూములకు సైతం నీరు అందించి పంటల దిగుబడులు పెంచే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. డెల్టా ఆధునీకరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యమన్నారు. 2025-26లో 332 పనులకు రూ.1,269.35 లక్షలు, 2026-27లో 535 పనులకు రూ.2,840.15 లక్షలు మంజూరు చేసి నీటి వినియోగదారుల సంఘాల ద్వారా పనులు చేపట్టినట్లు తెలిపారు. వరద రక్షణ చర్యల్లో భాగంగా సుమారు రూ.28.03 కోట్లతో వరద కరకట్టల పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.31.54 కోట్ల పుష్కర ఘాట్ పనులు, హెడ్ వర్క్స్ కింద రూ.681.24 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డెల్టా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.13.42 కోట్లతో లీడర్ (రా×ణూా=)సర్వే నిర్వహిస్తున్నా మన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2,19,511 ఎకరాలకు గాను 1,80,372 ఎకరాల్లో సాగు పూర్తయిందని తెలిపారు. అవసరమైన 43,633 మెట్రిక్ టన్నుల ఎరువులకు బదులుగా 51,455 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. కౌలు రైతులకు భరోసా కల్పించే విధంగా 2026-27లో లక్ష సీసీఆర్ సి కార్డుల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 43,338 సీసీఆర్ సి కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా గత రెండు సంవత్సరాల్లో 1,03,761 మంది రైతులకు రూ.207.52 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద రూ.2.89 కోట్ల సబ్సిడీతో యంత్ర పరికరాలు అందించినట్లు తెలిపారు. జిల్లాలో 21,297 హెక్టార్లలో కొబ్బరి, ఆయిల్‌పామ్, కోకో, అరటి తదితర ఉద్యాన పంటలు సాగవుతున్నాయని తెలిపారు. ఆక్వా రైతులకు మద్దతుగా ఫీడ్ ధరలు తగ్గించడంతో పాటు ప్రతి ఆక్వా రైతుకు యూనిట్ విద్యుత్‌కు రూ.1.50 సబ్సిడీని అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ కాలంలో ఆర్థిక సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి జిల్లాలో 1,774 కుటుంబాలకు రూ.3.57 కోట్ల సహాయం అందించినట్లు తెలిపారు. దీపం--2 పథకం ద్వారా అర్హులైన మహిళలకు ప్రతి నాలుగు నెలలకు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నాలుగు విడతల్లో దాదాపు రూ.140 కోట్ల గ్యాస్ సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు.

# విద్యార్థుల కు తుమ్మల పల్లి వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ విద్య కు ప్రోత్సహం

**ఎమ్మెల్యే నానాజీ అభినందన**





కరప (జిఎస్ బి వార్త) : విద్యా ప్రమాణం పెంపొందించడానికి ముందుకొస్తున్న తుమ్మలపల్లి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శనివారం కరప మండలం పెనుగుదురు పాఠశాలలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ తుమ్మల పల్లి మాచ్రావు ఆధ్వర్యంలో వారి తండ్రి పేరు న తుమ్మల పల్లి వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవాకార్యక్రమాలు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామం లో ఆర్ ఓ ప్లాంట్ తో రోజు 500టిన్నులు వాటర్ ఉచితంగా అందిస్తున్నారు. అదే విదంగా స్కూల్ కు వంటశేడ్ కు 5 సెంట్లు భూమి కూడా అందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం విద్యార్థుల కు ప్రోత్సహం గా బహుమతి లు అందించిన సందర్భంగా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కరప మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, మండలం జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి, పెనుగుదురు నీటి సంఘం అధ్యక్షులు తుమ్మల పల్లి గోవిందరాజులు,నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పరిపాలన ప్రగతి పథంలో రాష్ట్రం



కాకినాడ రూరల్, ఆగస్టు 15(జిఎస్ బి వార్త): అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి పరిపాలన సాగుతోందని, రెండేళ్ల కాలంలో రాష్ట్రం వేగంగా ప్రగతి పథంలో ప్రజలకు సంక్షేమం అందుతుందని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు తెలిపారు. ?కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో శనివారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో సాగిన ఈ పర్యటనలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నాయకులు గ్రామ వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి కుశల ప్రశ్నలు అడుగుతూ, సమస్యలను ఆరాతీశారు. ?ఈ సందర్భంగా నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. పాలనలో పారదర్శకత, ప్రగతిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రి వెంకటరాజు, నరసింగరావు, మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్, కాళ్ళ శ్రీనివాస్, ఎలగా లోవరాజు, కొండా వినాయక్, పెంకే గోవింద్, పలివెల గాయత్రి, పాలిక ఉషారాణి, పిల్లి రమణమ్మ, టేకుమూడి శ్రీను, వాసంశెట్టి పోతురాజు, గుబ్బల శివలతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, మహిళలు, యువత పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు 9 సైకిళ్ల పంపిణీ

**ఓం సాయి మెరైన్ సేవలు అభినందనీయం: గ్రామస్థులు**




కరప (జిఎస్ బి వార్త) : కరప మండలం సిరిపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గ్రామ మాజీ సర్పంచ్ నున్న సుజాత, వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం సాయి మెరైన్ సంస్థ అధినేతలు నున్న సూర్యనారాయణ మూర్తి, నున్న రామచంద్రరావు సహకారంతో గ్రామానికి చెందిన పేద విద్యార్థులకు తొమ్మిది సైకిళ్లను పంపిణీ చేశారు. సిరిపురం నుంచి వేలంగికి చదువుకోడానికి వెళ్లే పేద విద్యార్థులు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సైకిళ్లను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, ఓం సాయి మెరైన్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సంస్థ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.



# విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు పాటుపడాలి

**శంఖవరం మాజీ వైస్ ఎంపీపీ బొమ్మిడి**



అన్నవరం, (జిఎస్ బి వార్త), ఆగష్టు - 15 : విద్యార్థులు స్వాతంత్ర్య సాధనకు ప్రాణాలు అర్పించిన మహానీయుల ఆశయ సాధనకు పాటు పడాలని శంఖవరం మాజీ వైస్ ఎంపీపీ, కూటమి ప్రభుత్వ నాయకులు బొమ్మిడి సత్యనారాయణ పేర్కొన్నారు.అన్నవరం దేవస్థానం హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం ఏఈఓ బలువు సత్య శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ గావించారు. వివిధ ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు,ముఖ్య అతిధులుగా హాజరైన కూటమి ప్రభుత్వ నాయకుల చేతుల మీదుగా మెమొంటోల ప్రధానం చేసారు. ఈసందర్భంగా నాయకులు బొమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ, దేశభక్తి, ఐకమత్యం మరియు సేవా భావంతో దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం విద్యార్థులు, నాయకులు ఉపాధ్యాయులందరికీ సత్యదేవుని ప్రసాదం, స్వీట్స్ పంపిణీ చేశారు. ఏఈఓ బలువు సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చే విధంగా యువత ముందుకు సాగాలని, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. భారతదేశం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలవడానికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని కోరారు. క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, దేశం పట్ల మన బాధ్యతలను గుర్తు చేసే పవిత్రమైన సందర్భమని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి శంకర్, పసుపులేటి చక్రి,టి.సత్యేంధ్ర, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాద్యాయులు పర్వత వీరేష్, అనకాపల్లి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# బిక్కవోలు ఏ ఎస్సై రఘుకు అత్యుత్తమ సేవా పతకం



బిక్కవోలు,ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త (పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ.. అత్యుత్తమ సేవలు అందించిన బిక్కవోలు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పి. రఘుకు అరుదైన గౌరవం దక్కింది.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి సేవా పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా బిక్కవోలు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి. రఘుకు సేవా పతకం లభించింది. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా రఘు సేవా పతకాన్ని అందుకున్నారు. పోలీసు శాఖలో విధి నిర్వహణ అంటే కేవలం ఉద్యోగం కాదని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. తన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని అందుకోవడం పట్ల ఏఎస్ఐ రఘు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని,భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విధులను మరింత అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. రఘుకు సేవా పతకం లభించడంతో బిక్కవోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది, సహచర పోలీసు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

# కాశీ వారహి అమ్మ వారికి నడకుదురు నుండి 600మంది తో సారె



కరప (జిఎస్ బి వార్త) : కరప మండలం కొరిపల్లి శ్రీ కాశీ వారహి అమ్మవారికి శనివారం నడకుదురు నుండి సుమారు 600 మంది భక్తులు సారె తీసుకొచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ధర్మకర్త చిక్కాల దొరబాబు వారికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

రాజమహేంద్రవరం, (జిఎస్ బి వార్త) 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక ఆనం కళా కేంద్రం ప్రాంగణంలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి పి ఆర్ ఓ పి.రవి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి సిబ్బందికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బషీర్ అహ్మద్, వర్మ, జానీ, దుర్గారావు, గంగాభవాని, ఆనంద్ పాల్గొన్నారు.



## ఉప్పాడ తీర రక్షణ గోడకు కృషిచేసినపవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం



యు కొత్తపల్లి ఆగస్టు 15(జి ఎస్ బి వార్త )ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల చిరకాల కోరిక నెరవేరే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసిన సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాన్ కు మత్స్యకారులు రీతిలో పాలాభిషేకం నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ సమీపంలో ఉన్న అమీనాబాద్ నుంచి నేమం వరకు సముద్ర కోతను అరికట్టి తీర ప్రాంత ప్రజలకు రక్షణ కల్పించేందుకు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు ప్రారంభమైన సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు ఆధ్వర్యంలో ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు, జనసేన నాయకులు, కార్యకర్తలు సమక్షంలో అమీనాబాద్ హార్బర్ నుంచి సుమారు 500 మీటర్ల మేర సముద్రంలోకి వెళ్లి అలల మధ్య రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సముద్ర కోత కారణంగా ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు,ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం ముందడుగు వేయడం ఎంతో సంతోషకరమన్నారు. రూ.323 కోట్లతో చేపట్టనున్న తీర రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగించినట్లు తెలిపారు.నవంబర్ నెలలో రక్షణ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.డీసీసీబీ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబుమాట్లాడుతూతమను నమ్మి ఎన్నుకున్న ప్రజలకు నిరంతరం సేవ చేయాలనే అంకితభావంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు ముఖ్యంగా మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నా దశాబ్దాలుగా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు సముద్ర కోత సమస్యతో తీవ్ర మనోవేదనకు గురయ్యారని, ఇప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. తీర రక్షణ గోడ నిర్మాణం పూర్తయితే ఉప్పాడ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుందని తెలిపారు. మత్స్యకారుల తరపున కృతజ్ఞతగా ఈ పాలాభిషేకం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పాడ మండల అధ్యక్షులు రావు అక్షయ్, ఆక్వా డైరెక్టర్ వంకా కొండబాబు, ఉప్పాడ జనసేన పార్టీ గ్రామ ఇన్‌చార్జ్ గంట విజయ్ కుమార్, అమీనాబాద్ గ్రామ ఇన్‌చార్జ్ పెరమళ్ల వీరేష్, మూలపేట గ్రామ ఇన్‌చార్జ్ రామిశెట్టి రాంబాబు, పొన్నాడ పంచాయతీ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పల్లేటి బాపన్న దొర, మత్స్యకార వికాస విభాగం వైస్ ప్రెసిడెంట్ మైలపల్లి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమ్మిడి అమలేశ్వరి, యు.కొత్తపల్లి మండల మత్స్యకార నాయకులు సూరాడ నాగేశ్వరరావు, యు.కొత్తపల్లి మండల జనసేన నాయకులు, కార్యకర్తలు, ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులు పాల్గొన్నారు.

## రత్నగిరిపై ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్




అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 15 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం రత్నగిరిపై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు రత్నగిరిపై కళా వేధిక ప్రాంగణం వద్ద,దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈసందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జెండా వందనం సమర్పించారు. దేవస్థానం సాంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం చైర్మన్ రోహిత్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని, స్వాతంత్ర్య ఫలాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.దేశాభివృద్ధికి,ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు . దేవస్థానం ప్రత్యేక భద్రతా దళమైన ఎస్ పి ఎఫ్ వారి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం అందరికీ సత్యదేవుని ప్రసాదం, మిఠాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులు ,సిబ్బంది,వేదపండితులు, అర్చకులు,వేద పాఠశాల విద్యార్థులు, వ్రత పురోహితులు ,నాయి బ్రాహ్మణులు ,దేవస్థానం హై స్కూల్ విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ దొరబాబు కు అతి ఉత్కృష్ట సేవా పథకం అందజేత




కాకినాడ సిటీ ఆగస్టు 15 జి ఎస్ బి వార్త : కాకినాడ రూరల్ మండల పరిధిలోని సర్పవరం పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న మర్రి దొరబాబు (పి.సి 215)కు అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని అందు కున్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం లో భాగంగా కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్రి ప్రసాద్, జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంద్రి ప్రసాద్ కానిస్టేబుల్ దొరబాబు కు సేవా పతకాన్ని అంద జేశారు.విధి నిర్వహణ లో ఉత్తమ సేవలు అందించే పోలీసు సిబ్బందికి అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపిక చేస్తారు. 31 సంవత్సరాల తన సర్వీసులో ఎక్కడా చిన్న రిమార్కు లేకుండా ఉన్నతా ధికారుల ప్రోత్సాహం, స్టేషన్ సిబ్బంది సహకారంతో పని చేస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొంటు ఇప్పటివరకు అనేక అవార్డులు,రివార్డులు, ప్రశంసా పత్రాలను దొరబాబు అందుకున్నారు. అతి ఉత్కృష్ట సేవా పత్రాన్ని స్వీకరించిన సందర్భంగా పలువురు పోలీసు సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు దొరబాబు కు అభినందనలు తెలియజేశారు.

## జెమ్స్ స్కూల్‌లో జక్కంపూడి పతాకావిష్కరణ..



కోరుకొండ ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి జక్కంపూడి విజయలక్ష్మి గారు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. వివిధ విద్యా, క్రీడా మరియు ఇతర కార్యకలాపాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లిడి చంటిరెడ్డి, ప్రిన్సిపాల్ వీ. అనూతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు అడపా కనకరాజు, నీరుకొండ బాబ్జి, తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి, తాడి ఆదిరెడ్డి, నేతుల చిన్ని, గొల్లపల్లి ప్రవీణ్, అయిలా రామకృష్ణ, గుగ్గిలం భాను, చిక్కిరెడ్డి భాస్కర్, రాజారెడ్డి, శ్రీరంగం శ్రీను, లక్ష్మి శిరీష తదితరులు పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## మరిడమ్మ అమ్మవారికి దోసెడు పసుపు కొమ్ములు...



పెద్దాపురం, ఆగస్టు 15, జి ఎస్ బి వార్త : పెద్దాపురం గ్రామ దేవత అయిన శ్రీ మరిడమ్మ అమ్మవారి ఆలయానికి శనివారం మహిళా భక్తులు పోటెత్తారు. శ్రావణ మాస పర్వదినాల్లో భాగంగా అమ్మవారికి దోసెడు పసుపు కొమ్ముల సమర్పణ కార్యక్రమానికి ఆలయ కార్య నిర్వహణ అధికారిణి కె విజయలక్ష్మి ఇచ్చిన పిలుపుమేరకు పలు ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పసుపు కొమ్ములను అమ్మవారికి సమర్పించారు. విచ్చేసిన భక్తులలో ప్రధానంగా లలితా సంకీర్తన భక్తమండలి సభ్యులు ఉండగా వారు ఆలయంలో ప్రత్యేక సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ శ్రావణమాసంలో ఈ విధంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన పసుపు కొమ్ములను అమ్మవారి సన్నిధిలో ఉంచి శ్రావణ శుక్రవారం రోజున పూజల్లో పాల్గొనే మహిళా భక్తులకు వాటిని అందించనున్నట్టు చెప్పారు. ఇలా అమ్మవారి పసుపు కొమ్ములను పొందే భక్తులు దీర్ఘ సుమంగళీ లుగా, అష్ట ఐశ్వర్యాలతో జీవిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అర్చకులు భక్తులకు సేవలు అందించారు.

## అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



కాకినాడ, ఆగస్టు 15(జిఎస్ బి వార్త) : అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అన్జనేయనగర్ కాలనీ,ఇూూ క్యాంపస్ ఎదురుగా ఉన్న వావ్ కిడ్స్ స్కూల్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు యాళ్ళ రత్నారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశభక్తి, ఐకమత్యం మరియు సేవా భావంతో దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం విద్యార్థులు, పాల్గొన్న సభ్యులు మరియు అతిథులకు స్వీట్లు, చికీస్ మరియు చాక్లెట్లు పంపిణీ చేశారు. మాజీ జిల్లా గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నెరవేర్చే విధంగా యువత ముందుకు సాగాలని, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. వైస్ జిల్లా గవర్నర్ చిట్టూరి వీరప్రసాద్ మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలవడానికి ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని కోరారు. క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, దేశం పట్ల మన బాధ్యతలను గుర్తు చేసే పవిత్రమైన సందర్భమని అన్నారు. యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యడవిల్లి మురళీధర్, జె. లక్ష్మావతి, జిల్లా ఛైర్మన్ పడాల సూర్యనారాయణ రెడ్డి, జె. కృష్ణ ప్రసాద్, డి.ఎల్. శాస్త్రి, ఎన్. వెంకటేశ్వరరావు, ఆషు సధనాని, ఆర్. రవిశంకర్ పట్నాయక్, సీలం సునీత, ఎ. రామారెడ్డి, పి. సుబ్బారావు, వై. పద్మ, కుడిపూడి వెంకటేశ్వరరావు, కోశాధికారి కె. శ్రీలక్ష్మి, కార్యదర్శి దామిశెట్టి శ్రీనివాసరావు, పూర్ణిమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దేశభక్తి గీతాలు, ప్రసంగాలు మరియు విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## వేళంగి విద్యార్థి పిల్లి ఆదిత్య పెద్దాపురం నవోదయ పాఠశాలకు అర్హత



కరప (జిఎస్ బి వార్త) : కరప మండలం వేళంగి విద్యార్థి గత2026 సంవత్సరం నవోదయ ప్రవేశ పరీక్షలో ఎయిమ్ కిడ్స్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి పిల్లి ఆదిత్య పెద్దాపురం నవోదయ పాఠశాలకు అర్హత సాధించాడు.శనివారం స్వాతంత్ర్య వేడుకల్లో ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాకినాడ తెలుగుదేశం పార్లమెంటు అధ్యక్షులుచంద్రు వెంకన్న రాయి చౌదరి, మాజీ ఎంపీటీసీ వెలుగుల లచ్చారావ్ , ఎయిమ్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ గాడ్విన్ , ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలియజేశారు.

## పెరేడ్ లో ప్రత్యేకాకర్షణగా "అన్నవరం సత్యరథం"



అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 15 : పంద్రాగష్టు వేడుకలలో భాగంగా కాకినాడ పెరేడ్ గ్రౌండ్ లో శనివారం ఏర్పాటు చేసిన పలు శకటాల ప్రదర్శణలో అన్నవరం దేవస్థానం "సత్యరథం" ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ వేడుకలలో ముఖ్య అతిధులుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పాల్గొని శకటాల ప్రదర్శణను ఆసక్తిగా తిలకించారు. వేధ మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ "జై సత్యదేవా నామస్మరణతో" సత్యరథం పెరేడ్ గ్రౌండ్ లో ముందుకు సాగుతూ ఉంటే ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.సత్యరథం ప్రదర్శణతో అక్కడున్న అధికారులంతా మంత్రముగ్ధులయ్యారు. పెరేడ్ గ్రౌండ్ లో పంద్రాగష్టు వేడుకలకు హాజరైన అతిరధమహారదులంతా సత్యరథంలో కొలువుతీరిన సత్యదేవుడు, అమ్మవారిని దర్శించి తరించారు.నాయకులు,జిల్లా అధికారులందరికీ సత్యదేవుని ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావు, ఆలయ ఏఈఓ పెండ్యాల భాస్కర్, సూపరింటెండెంట్ పర్వత నరేష్, ఈఈ రామకృష్ణ, తాటిపాక రాంజీ, అర్చకులు, వేధపండితులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




కాజులూరు( జిఎస్ బి వార్త) ఆగస్టు 15 : మండల కేంద్రమైన కాజులూరు పి ఎమ్ శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాజులూరులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు.ఈ వేడుకలకు ాావీజ చైర్మన్ పెంటపాటి పద్దరాజు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల విద్యా అభివృద్ధికి సహకరిస్తున్న దాత అన్యం శ్రీరామచంద్ర మూర్తి, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు . క్రీడలలో పాల్గొనే విద్యార్థులు 20 మందికి స్పోర్ట్స్ డ్రెస్ లు స్పాన్సర్ చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు పాడారు. అనే నేను కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్ లో వాళ్ళ లక్ష్యాన్ని వివరిస్తూ ఆహుతులను ఆకట్టుకున్నారు. సాధించిన 6గురు విద్యార్థులకు మెమెంటో లను అందించారు ఈ ఆరుగురికి మరో ఉపాధ్యాయుడు శ్రీశా ఒక్కొక్కరికీ 500 నగదు బహుమతి అందజేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, అమరావతి ఛాంపియన్ షిప్ లో భాగంగా జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు పతకాలు అందజేశారు. స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.స్టాఫ్ సెక్రటరీ హరినాథ్ మిగిలిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వేడుకలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి

## కోరుకొండ జనసేన కార్యాలయం వద్ద బత్తుల చే పతాకావిష్కరణ..



కోరుకొండ ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త) : కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి భత్తుల వెంకటలక్ష్మి శనివారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ మండలం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా, దేశభక్తి పూరిత వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని మువ్వన్నెల జాతీయ పతాకాన్ని సగర్వంగా ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ "స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, మహనీయుల పోరాట ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నాం. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని"ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, జాజుల గణేష్, మట్ట నాగేశ్వరరావు తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## ఐ అండ్ పి ఆర్ సిబ్బంది కి ఉత్తమ సేవా పురస్కారాలు



కాకినాడ, (జిఎస్ బి వార్త ) శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న కాకినాడ సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్ ఎన్.సూరయ్య, డ్రైవర్ ఎం.ఎస్.పి.డి.ప్రసాద్.లికు ఉత్తమ సేవ ప్రశంస పత్రం అందించారు.

## ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించింది

### ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి ఆగస్టు 15 (జి ఎస్ బి వార్త ) ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా ఆనాడు మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందని ఎమ్మెల్యే నల్లమిల్లిరామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి తిలక్ రెడ్డి వర్తక సంఘం కళ్యాణ మండపశీలో 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వర్తక సంఘం అధ్యక్షులు కొవ్వూరి వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర వైద్యులు, నేత్ర వైద్యశీలో విశేషమైన సేవలు అందిస్తున్న తేతలి సత్యనారాయణరెడ్డి ,తేతలి రామిరెడ్డి మంగాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విశేషమైన సేవలు అందిస్తున్న తేతలి నారాయణరెడ్డి , పార్మసిస్టు రాష్ట్ర అధ్యక్షులు నల్లమిల్లి ఆదిరెడ్డి లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా ఆనాడు మనకి స్వాతంత్రం సిద్ధించడం జరిగిందన్నారు. భారతీయ సనాతన సంస్కృతి సాంప్రదాయాల విషయంలో మనది ఒక బలమైన పునాది ఉన్న భారతదేశం. ఈ భారతదేశం యొక్క మూలాల్ని కదిలించాలని అనేకమైన విదేశీ శక్తులు ప్రయత్నం చేసిన విషయం మన అందరికీ తెలుసు అన్నారు. తురుష్కుల దండయాత్రల దగ్గర నుంచి మొగలాయిలు వరకు అనేక దండయాత్రలు మన భారతదేశం పైన పడి మన సంస్కృతి సాంప్రదాయాలని కబళించాలని ప్రయత్నం చేసిన నేటికీ చెక్కు చెదరకుండా ఉండడం అనేది ఇవాళ భారతీయ సనాతన సంస్కృతి యొక్క గొప్పతనం అని కూడా ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తున్న నేపథ్యం,మరొక పక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డిఏ కూటమి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏ విధమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తీసుకొని ముందుకు వెళ్తా ఉందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సత్కారం అందుకున్న వ్యక్తుల సేవా దృక్పథాన్ని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వర్తక సంఘం సభ్యులు, అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు, అనపర్తి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

